



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 336 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : నరసరావుపేట | బుధవారం 5 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :336 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : NARASARAO PETA | WED 5 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!



- పరీక్ష పత్రాల లీక్‌పై యువత ఆగ్రహం.. కేంద్ర మంత్రి రాజీనామా
- దేశంలో తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభంపై నిపుణుల ఆందోళన
- విద్యా వ్యవస్థ వైఫల్యం, పడిపోతున్న ఉపాధి అవకాశాలు

- మిగతా 2లో

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

- రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం
- వైసీపీలో చేరిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు
- గూడపాటిని పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్న జగన్



- మిగతా 2లో

## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి


పెన్ పవర్ డెస్క్:సై, గజినీ, ఛత్రపతి మొదలైన బ్లాక్ బస్టర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్ను మూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం

- మిగతా 2లో



# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు



"గత ఐదేళ్లది విధ్వంసం... మాది పునర్నిర్మాణం"

- గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీఎం.
- రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్ల సంక్షేమం, రూ.30,607 ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని వెల్లడి.
- అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతామని స్పష్టం.
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ట్రిపుల్ ఇంజన్ గ్రోత్ వ్యూహం.
- సంక్షేమం ఆగదు.. అభివృద్ధి ఆగదని చంద్రబాబు.

- మిగతా 2లో

| ఆర్థిక గణాంకాలు | రెండేళ్లలో సంక్షేమం | ఉద్యోగాల కల్పన |
|---|---|---|
| మొత్తం అప్పులు రూ. 9.74 లక్షల కోట్లు | రూ. 1,49,401 కోట్లు | 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు |

**దిద్దుబాటు చర్యలు**

- పెండింగ్ బిల్లుల్లో రూ.29,000 కోట్లకు పైగా చెల్లింపు.
- ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్.
- రీ-నెగోషియేషన్ ద్వారా రూ.8,269 కోట్ల ఆదా.
- 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణ.
- రూ.29,890 కోట్ల కేంద్ర నిధుల సమీకరణ

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనను "విధ్వంసం"గా అభివర్ణిస్తూ, తమ ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్నది "పునర్నిర్మాణం" అని స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, సంస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో చేపట్టిన దిద్దుబాటు చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ఆయన సమగ్రంగా వివరించారు.

**గత ఐదేళ్లది విధ్వంసం.. మాది పునర్నిర్మాణం**

2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇది ఒక నిశ్శబ్ద విప్లవం అని చంద్రబాబు అభివర్ణించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కూడా లేదని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభమైందని, అమరావతిని ఆపేసి, పోలవరాన్ని నిర్వీర్యం చేసి, పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి "బ్రాండ్ ఆంధ్రప్రదేశ్"ను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు అనునిత్యం శ్రమిస్తున్నామని తెలిపారు.



## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

### మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనపై సమీక్ష

- మిగతా 2లో

## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామన్న మంత్రి గొట్టిపాటి
- ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వెల్లడి
- పీఎం సూర్య ఘర్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిగా అమలు చేస్తామని స్పష్టం
- జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని విమర్శ
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగవంతం చేశామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 'ట్రూ డౌన్' చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. విద్యుత్ శాఖలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వ్యవస్థలను చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ సర్వనాశనం అయ్యాయి. మేము వాటిని బాగుచేస్తున్నాం" అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా వినియోగించుకుని,

- మిగతా 2లో



## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

### లోక్‌సభలో కేంద్రం వెల్లడి

- గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం
- గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం
- లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం
- ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం
- మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర

- మిగతా 2లో



### ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

## పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
- రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
- దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
- గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది.

- మిగతా 2లో



## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి

- మిగతా 2లో

# అహంకారం వినాశనానికి దారితీస్తుంది

### విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ తీవ్ర ఆగ్రహం



- త్రిషపై వ్యాఖ్యల కేసులో ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, విడుదల
- అధికార టీవీకే అహంకారంతో వ్యవహరిస్తోందన్న ఎంకే స్టాలిన్
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ

- మిగతా 2లో




## విడదల యాక్టివ్ అవ్వడానికి కారణమదేనటగా?

వైసీపీ నేత విడదల రజని మళ్లీ చిలకలూరి పేట నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీ నుంచి తిరిగి చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి గెలిచేందుకు ఆమె ఉవ్విళ్లూరుతున్నారు. చిలకలూరి పేట నియోజకవర్గంలో జరిగే వైసీపీ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటూ తిరిగి నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నాయకత్వం కూడా చిలకలూరి పేట ఇన్ ఛార్జిగా విడదల రజనిని నియమించడంతో ఆమె మరొకసారి గెలిచి తన సత్తా చూపాలని చూస్తున్నారు. ఇటీవల జరిగిన వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించినట్లు పార్టీ నాయకత్వానికి నివేదికలు అందాయి.

విడదల రజిని 2014లో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు శిష్యురాలిగా తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. విఆర్ ఫౌండేషన్ స్థాపించి నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. టీడీపీ నుండి ప్రత్తిపాటి పుల్లారావు అక్కడ పోటీ చేస్తుండడంతో 2018లో వైసీపీలో చేరారు. ఆమె 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పై 8301 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2022 ఏప్రిల్ 11న జరిగిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విడదల రజిని 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో గుంటూరు పశ్చిమ నుండి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి చేతిలో 51150 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

సామాజికవర్గం పరంగా... విడదల రజని ఆర్థికంగా బలమైననేత. సామాజికవర్గం పరంగా కూడా ఆమెకు కలసి వచ్చే అంశమే. భర్త కాపు సామాజికవర్గం కావడం కూడా ఆమెకు రాజకీయంగా కలసి వస్తుందని అంటున్నారు. విడదల రజని కుటుంబం విదేశాల్లో వ్యాపారాలు చేసి బాగానే సంపాదించారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై వరసగా కేసులు కూడా నమోదు అవుతుండటం విడదల రజనిపై సానుభూతి పెరిగిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీసీ ం కాపు సామాజికవర్గం కలగలిపి ఉండటంతో ఖచ్చితంగా గెలుపు గుర్రం ఎక్కుతారని వైసీపీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. విడదల రజనికి పార్టీ నాయకత్వం అండగా కూడా పుష్కలంగా ఉండటంతో ఈసారి చిలకలూరి పేట నుంచి పోటీ చేయడం ఖాయమని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. అక్కడ బలమైన నేతగా విడదల రజని ముద్ర పడ్డారు.

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020–21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024–25లో రూ. 7,901.56 కోట్లు, 2025–26లో రూ. 8,289.61 కోట్లు, 2026–27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

గత ప్రభుత్వ హయాంలో 2020–21లో రూ. 688 కోట్లు, 2022–23లో రూ. 6,105 కోట్లు, 2023–24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు

**విభజన నష్టం కంటే విధ్వంసమే ఎక్కువ**

2014లో రాష్ట్ర విభజన బాధాకరమైనప్పటికీ, 2019–24 మధ్య జరిగిన విధ్వంసం అంతకంటే భయంకరమైన మానసిక వేదనను మిగిల్చిందని చంద్రబాబు అన్నారు. విభజన సమయంలో 58% జనాభాకు 46% వనరులే వచ్చాయని, అయినా ఐదేళ్లలో కష్టపడి ఆర్థిక వ్యవస్థను ఒక దారికి తెచ్చామని గుర్తుచేశారు. కానీ, గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందని, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, రాష్ట్రాన్ని అగమ్యగోచర స్థితిలోకి నెట్టిందని విమర్శించారు.

**ఆర్థిక గమనం.. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం**

గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "2014–15లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ. 30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ. 25,000కు తగ్గించగలిగాం. కానీ, 2019–24 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ. 1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 2014–19 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ. 76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు" అని ఆయన విశ్లేషించారు.

**అప్పుల ఊబిలోంచి బయటపడేస్తున్నాం**

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచిందని, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఏపీ 'జీరో డెట్ సస్టైనబిలిటీ' స్థితికి చేరిందని, అంటే అప్పు పుట్టని దుస్థితికి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న రూ. 48,616 కోట్ల బిల్లుల్లో ఇప్పటికే రూ. 29,000 కోట్లకు పైగా చెల్లించామని, ఉద్యోగుల బకాయిలు రూ. 30,849 కోట్లు క్లియర్ చేశామని వివరించారు. అధిక వడ్డీలకు తీసుకున్న రూ. 50,000 కోట్ల విలువైన 370 రుణాలను పునఃసమీక్షించి (రీ–నెగోషియేట్), ఏటా రూ. 1,100 కోట్ల చొప్పున మొత్తం రూ. 8,269 కోట్ల ఆదా చేశామన్నారు. నిధులు పక్కదారి పట్టడంతో నిలిచిపోయిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, రూ. 29,890 కోట్లు డ్రా చేయగలిగామని తెలిపారు.

**సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధికి బాటలు**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ హామీలను నెరవేర్చడంలో వెనకడుగు వేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ. 1,49,401 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ. 68,296 కోట్లు, తల్లికి వందనం కింద రూ. 20,210 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ. 8,724 కోట్లు అందించామన్నారు. దీంతో పాటు, రెండేళ్లలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని గుర్తుచేశారు.

**P4, కుటుంబ సాధికారతతో పేదరిక నిర్మూలన**

సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం 'కుటుంబ సాధికారత మిషన్' ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి ప్రజల భాగస్వామ్యాన్ని జోడించి P4 అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. 'మార్గదర్శి బంగారు కుటుంబం' (వీదీఖ 10–20) పథకం కింద సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10% మంది, వెనుకబడిన 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

**అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతాం**

అమరావతి ప్రజల రాజధాని అని, అది ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫేజ్–1 పనుల కోసం ఇప్పటికే రూ. 41,000 కోట్లకు పైగా నిధులు సమీకరించామని, త్వరలోనే పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మార్చి నాటికి పూర్తిచేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. దీనికోసం రూ. 12,157 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

**మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ వ్యూహం**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'డబుల్ ఇంజన్ సర్కార్ – ట్రిపుల్ ఇంజన్ గ్రోత్' వ్యూహాన్ని అనుసరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ఆర్థిక రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

1. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (VER): పోర్ట్ ఆధారిత తయారీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తారు. సుమారు రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.
2. అమరావతి ఎకనామిక్ రీజియన్ (AER): పరిపాలన, నాలెడ్జ్ క్యాపిటల్‌గా, ఏఐ, క్వాంటం, డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దుతారు. రూ. 6–8 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం.
3. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (TER): స్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. రూ. 10–12 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.

**ముందున్న సవాళ్లు.. భవిష్యత్ ప్రణాళిక**

రాష్ట్ర సొంత ఆదాయంలో 98% ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతోందని, ఇది కర్ణాటక (28%), తెలంగాణ (44%)తో పోలిస్తే చాలా అధికమని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (VGF) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సాధించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్

సూర్యాపేట జిల్లా తుంగ˘తుర్తి అసెంబ్లీ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గూడపాటికి వైసీపీ కండువా కప్పి జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... గూడపాటి శ్రీనివాసరావును వైసీపీ కుటుంబంలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడిందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి బలాబలాల దృష్ట్యా రేపల్లె నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుంది.

# నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!

పరీక్ష పత్రాల లీకేజీ ఉదంతాలపై దేశవ్యాప్తంగా యువత నిరసనలతో అట్టుడగడంతో, గత నెలలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంతో మోదీ ప్రభుత్వం తాత్కాలికంగా సంక్షోభం నుంచి గట్టెక్కినప్పటికీ, యువతలో పేరుకుపోతున్న అసంతృప్తి భవిష్యత్తులో ప్రభుత్వానికి దీర్ఘకాలిక సవాల్‌గా మారనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ బీబీసీ ఓ కథనం వెలువరించింది. లీకేజీ కేసుల విచారణ నిమిత్తం ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని, పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం టెక్ నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీని నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయినప్పటికీ, తగిన ఉపాధి అవకాశాలు కల్పనలోనూ, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన విద్యను అందించడంలోనూ విఫలమవుతున్న ప్రస్తుత వ్యవస్థపై యువతలో అసహనం పెరుగుతోంది. వారి ఆందోళనలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం మరింత నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా బీబీసీతో మాట్లాడుతూ, "గత దశాబ్ద కాలంలో కార్మిక మార్కెట్ స్థితుగతులు క్షీణించాయి. వ్యవసాయేతర ఉద్యోగాల సృష్టి మందగించడంతో పాటు, వాస్తవ వేతనాలు కూడా స్తంభించిపోయాయి" అని వెల్లడించారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ వల్ల ఉద్యోగాలకు గిరాకీ పెరగడం లేదని, మరోవైపు మన విద్యా వ్యవస్థ సైతం నాణ్యమైన మానవ వనరులను అందించడంలోవెనుకబడి ఉందని ఆయన విశ్లేషించారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం, ప్రస్తుతం పట్టభద్రుల్లో నిరుద్యోగిత రేటు గత 25 ఏళ్ల నాటి తరహాలోనే 35–40 శాతం వద్ద కొనసాగుతోంది. అయితే, పెరిగిన జనాభా దృష్ట్యా సమస్య తీవ్రత మరింత అధికంగా కనిపిస్తోంది. 2023 నాటికి 67 శాతం మంది గ్రాడ్యుయేట్లకు సరైన ఉపాధి లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా, జీడీపీలో తయారీ రంగం వాటా 17 శాతం నుంచి 14 శాతానికి తగ్గడం, కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఐటీ రంగంలో నియామకాలు మందగించడం ఈ సంక్షోభాన్ని మరింత జఠిలం చేస్తున్నాయి.

కేవలం ఏసీ కార్యాలయాల్లోని ఉద్యోగాలనే ఆశించకుండా, నైపుణ్యం ఆధారిత వృత్తులైన ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ వంటి పనులను కూడా చేపట్టేందుకు యువత సిద్ధపడాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత యువత తమ తల్లిదండ్రుల కంటే మెరుగైన జీవన ప్రమాణాలను పొందలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇది దేశానికి పెను ముప్పుగా పరిణమించకుండా మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి

- మొదటి పేజి తరువాయి

(ఆగస్టు 04) ముంబయిలో గుండెపోటుతో మృతి చెందారు.

ఆయన గత కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు నటి విపన థప మీడియాకు తెలిపారు. ప్రదీప్ రావత్ తెలుగు, హిందీ, తమిళ సినిమాలతో దేశవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు. తెలుగులో 2004లో వచ్చిన సై సినిమాలో భిక్షు యాదవ్ పాత్రతో చూపించిన విలనిజంతో పాపులర్ అయ్యారు. ఆ సినిమాకు బెస్ట్ విలన్ గా ఫిలింఫేర్ అవార్డు కూడా అందుకున్నారు. ఆ తర్వాత గజినీ, భద్ర,అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్ మొదలైన సినిమాలతో తన విలనిజాన్ని పండించారు. లేటెస్టుగా వాల్తేరు వీరయ్య, గాయపడ్డ సింహం సినిమాల్లో నటించారు.

1952లో జబల్పూర్ లో జన్మించారు. ఆయనకు భార్య కళ్యాణి రావత్, ఇద్దరు కుమారులు విక్రమ్ రావత్, సింగ్ రావత్ లు ఉన్నారు. బీ.ఆర్ చోప్రా తెరకెక్కించిన మహాభారతంలో అశ్వత్థామ పాత్రతో ఆయన వెండితెరకు పరిచయమయ్యారు. ప్రదీప్ రావత్ దాదాపు 80 సినిమాల్లో నటించారు. హిందీలో సర్ఫరోష్, లగాన్, దీవార్, గజినీ సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నారు.

## ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్.. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- మొదటి పేజి తరువాయి

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- మొదటి పేజి తరువాయి

సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే, తాము చేస్తున్న పనులను వారి దృష్టికి తీసుకెళుతున్నామని గొట్టిపాటి రవికుమార్ వివరించారు.

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

తమిళనాడులో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, అనంతరం విడుదల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ పరిణామంపై ఉదయనిధి తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే (తమిళగ వెట్రి కళగం) ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. "అహంకారం వినాశనానికి దారితీస్తుంది. అహంభావం మితిమీరితే పతనం మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన హెచ్చరించారు. ప్రముఖ నటి త్రిషను ఉద్దేశించి ద్వంద్వార్థాలు వచ్చేలా వ్యాఖ్యానించారన్న ఆరోపణలతో పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను మంగళవారం అరెస్టు చేశారు. సుమారు నాలుగు గంటలపాటు విచారించిన అనంతరం ఆయనను విడుదల చేశారు. అయితే, తన ప్రసంగంలో ఎలాంటి అసభ్యత లేదని ఉదయనిధి స్పష్టం చేశారు. కావేరి జలాల సాధనలో, మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను తాను ప్రశ్నించినందుకే, కక్షపూరితంగా ఈ చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై స్పందించే ధైర్యం లేక, కావేరి అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రభుత్వం ఉదయనిధిని అరెస్ట్ చేసిందని ఎం.కె. స్టాలిన్ విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ఒక్కరోజు ముందు ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఆయనను సభకు హాజరుకాకుండా అడ్డుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులు, విద్యార్థులు, రైతుల గొంతు నొక్కేందుకు టీవీకే ప్రభుత్వం అరెస్టులను ఒక ఆయుధంగా వాడుకుంటోందని డీఎంకే నేతలు విమర్శలు గుప్పించారు.

## పరారీలో ఉన్న నేరస్థుల అప్పగింతలో భారత్‌కు భారీ విజయం కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 4:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో 2019 నుంచి 2026 వరకు ప్రపంచంలోని 36 దేశాల నుంచి మొత్తం 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు అప్పగింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రక్రియను జాతీయ ప్రాధాన్యతగా తీసుకుని చట్టపరమైన సంస్కరణలు, అంతర్జాతీయ సహకారం, ఆధునిక సాంకేతికతతో చర్యలను మరింత వేగవంతం చేసినట్లు తెలిపింది. పరారీలో ఉన్న నేరస్థుల ఆచూకీ కోసం భారత్‌పోల్ వ్యవస్థను ప్రారంభించి, 1,400కుపైగా కేంద్ర, రాష్ట్ర సంస్థలను అనుసంధానం చేసినట్లు పేర్కొంది. అలాగే ఆపరేషన్ త్రిశూల్ ద్వారా శాటిలైట్ సాంకేతికత, డిజిటల్ ఫుట్‌ప్రింట్ల సహాయంతో విదేశాల్లో తలదాచుకున్న నేరస్థులను గుర్తించే చర్యలు చేపట్టినట్లు వివరించింది. గత మూడు సంవత్సరాల్లో 401 ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ కాగా, 2019 నుంచి 2026 వరకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద రూ.17,874 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొత్త క్రిమినల్ చట్టాల ద్వారా పరారీలో ఉన్న నిందితులపై వారి గైర్హాజరీలోనే విచారణ నిర్వహించే నిబంధనలు కూడా అమల్లోకి వచ్చినట్లు తెలిపింది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా | కృష్ణా | గుంటూరు | పల్నాడు | బాపట్ల

## చిన్నారుల చిరునవ్వుకు శ్రీదంత్ భరోసా
## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్






**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 04:** చిన్నారుల నవ్వు నిండుగా.. దంత ఆరోగ్యం మెండుగా ఉండాలనే సంకల్పంతో పాఠశాల విద్యార్థులకు డా. శ్రీధర్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత దంత ఆరోగ్యం, వైద్య సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం నగరంలోని పటమట కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో డా. శ్రీధర్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీదంత్ స్కూల్ డెంటల్ హెల్త్ కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఇప్పటివరకు ఫౌండేషన్ ద్వారా 12 లక్షల మందికిపైగా పాఠశాల విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించినట్లు డా. అరుమళ్ల శ్రీధర్‌రెడ్డి వివరించారు. ఇప్పుడు మరో ముందడుగుగా లక్ష మంది పిల్లల దంత ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా రూపొందించిన కార్యక్రమం గురించి ఇటీవల ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు దంత ఆరోగ్యం ఎంతో కీలకమని.. దంత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు, అవసరమైన వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆరోగ్య ఆంధ్ర సాకారంలో డా. శ్రీధర్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న భాగస్వామ్యం స్ఫూర్తిదాయకమన్నారు. ఆరోగ్యవంతమైన చిరునవ్వుతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ అన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు డా. శ్రీధర్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. లక్ష మంది విద్యార్థుల దంత ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతమైన దంతాలతో, అందమైన చిరునవ్వుతో ఎదగాలని ఆకాంక్షిస్తూ, తల్లిదండ్రులు కూడా పిల్లల దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మండలి వెంకటకృష్ణారావు శత జయంతి
## జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 4 :** స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త, తెలుగు భాషా సంస్కృతి పరిరక్షకుడు, మాజీ విద్యాశాఖ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలోహొ జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలిహొహొఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్ణయించింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వెంకటకృష్ణారావు జీవిత విశేషాలు, విద్యా రంగానికి, తెలుగు భాషాభివృద్ధికి, సామాజిక సేవకు ఆయన చేసిన విశిష్ట సేవలను వివరించారు. యువతలో సేవా భావం, దేశభక్తి, తెలుగు భాష పట్ల గౌరవాన్ని పెంపొందించేలా వ్యవహరించారని అన్నారు. మండలి వెంకటకృష్ణారావు ఆశయాలను భావితరాలకు చేరవేయడం, ఆయన చేసిన సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుల్లో ఒకరని, ఆయన రాజకీయవేత్త, గాంధేయవాది, సంఘసేవకుడు, విద్యా--సాంస్కృతిక పరిరక్షకుడుగా సేవలు అందించారని అన్నారు. ప్రజాసేవను జీవిత ధ్యేయంగా తీసుకొని నిరాడంబర జీవనం గడిపిన ఆయనను "దివిసీమ గాంధీ" అని గౌరవంగా పిలవడం, ఆయన పట్ల ప్రజలకు గల గౌరవం తెలియజేస్తుందన్నారు. గ్రామీణాభివృద్ధి, విద్య, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దివిసీమ ప్రాంత అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. 2026లో ఆయన శత జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుటకు నిర్ణయించడం ముదావహం అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అధికారి రమ్య, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి, స్టెప్ సి.ఇ.ఓ పి.వి.ఎన్.సత్యనారాయణ, మాజీ ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డి. సుబ్రహ్మణ్యం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. మాణిక్యాలరావు, సీనియర్ సిటిజన్ మాధా రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గాంధేయ విలువలకు ప్రతీక మండలి వెంకట కృష్ణారావు : కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 4:** గాంధేయ విలువలు, త్యాగం, ప్రజాసేవకు చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా మంగళవారం విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొని, భూదానోద్యమ స్ఫూర్తితో తనకు లభించిన ఐదు ఎకరాల భూమిని పేదలకు దానం చేసిన మహోన్నత వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. మంత్రి హోదాలో సాంఘిక సంక్షేమం, మత్స్యశాఖ, విద్యా--సాంస్కృతిక రంగాల్లో అనేక సంస్కరణలు చేపట్టారని, నాగార్జున, కాకతీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు తోడ్పడ్డారని పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల విజయవంతమైన నిర్వహణతో తెలుగు భాషకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారని, 1977 దివిసీమ ఉప్పెన సమయంలో సహాయం, పునరావాస కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించి బాధితులకు అండగా నిలిచారని గుర్తుచేశారు. గాంధీ క్షేత్రం ద్వారా విద్య, సేవా కార్యక్రమాలను విస్తరించి వేలాది కుటుంబాలకు చేయూతనందించిన ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. లక్ష్మీ నరసింహ, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొని స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావుకు ఘన నివాళులర్పించారు.

## అంగన్వాడీలను సంతృప్త స్థాయిలో నిర్వహించాలి
## : జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ




**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 4 :** అంగన్వాడీలను సంతృప్త స్థాయిలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ లో ఎల్లప్పుడూ సానుకూల స్పందన పొందేవిధంగా ఎప్పుడూ పనిచేయాలని సూచించారు. ప్రతి అంశాన్ని నిశితంగా తనిఖీ చేయాలని సీడీపిఓ లను, పర్యవేక్షకులను ఆదేశించారు. శాఖకు సంబంధించిన అన్ని నివేదికల్లో – ప్రీస్కూల్ అటెండెన్స్, ఆపార్ ఐడి క్రియేషన్, లబ్ధిదారుని అభా ఐడి క్రియేషన్, టేక్ హోమ్ రేషన్ పంపిణీ, పాన్ కుడి, ఏ.ఐ.ఇ.సి.డి స్క్రీనింగ్, గ్రోత్ మానిటరింగ్, పి.ఎం.ఎం.వి.వై, సరుకుల నమోదు తదితర శాఖా పరమైన సూచీలకు అనుగుణంగా ఖచ్చితమైన, నాణ్యమైన డేటాను నమోదు చేసి, లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లిపాలు అందించే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.పి.జి. ప్రసూన, సి.డి.పి.ఓ లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## మెగా యూత్ ఫోర్స్ నెల్లూరు జిల్లా జాయింట్ కన్వీనర్‌గా సయ్యద్ నయీమ్ నియామకం
### కొణిదెల సుస్మిత చేతుల మీదుగా నియామక పత్రం అందజేత




**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 4:** మెగా యూత్ ఫోర్స్ నెల్లూరు జిల్లా జాయింట్ కన్వీనర్‌గా గూడూరు కు చెందిన సయ్యద్ నయీమ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ గౌరవాధ్యక్షురాలు కొణిదెల సుస్మిత ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొణిదెల సుస్మిత మాట్లాడుతూ, మెగా కుటుంబానికి అండగా నిలుస్తూ సినిమాలతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న అభిమానుల సేవాభావం అభినందనీయమన్నారు. మెగా కుటుంబం పట్ల అంకితభావం, సామాజిక సేవ పట్ల నిబద్ధత, అభిమానులను ఏకతాటిపై నడిపించే నాయకత్వ లక్షణాలను గుర్తించి సయ్యద్ నయీమ్‌ను నెల్లూరు జిల్లా జాయింట్ కన్వీనర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ నియామకం 2026 జూలై 25 నుంచి 2027 జూలై 24 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ బాధ్యతల్లో భాగంగా జిల్లాలోని మెగా అభిమానులను సమన్వయం చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు మెగా హీరోల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. మెగా కుటుంబానికి మంచి పేరు తీసుకు రావడంతో పాటు అభిమానుల గౌరవం, ప్రతిష్ఠలను మరింత పెంచే విధంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం సయ్యద్ నయీమ్‌ను అభినందించిన కొణిదెల సుస్మిత శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నయీమ్, నటుడు నాగబాబు కుమారుడు, హీరో సాయి ధరమ్ తేజ్తో పాటు టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ నయీమ్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే చిరంజీవి, పవన్ కళ్యాణ్ల వీరాభిమానినని తెలిపారు. వారి స్ఫూర్తితో గత 15 ఏళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. ప్రతి సంవత్సరం మెగా రక్తదాన శిబిరాలు, ప్రతి వారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యత దక్కడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## జగన్ తన సంపద పెంచుకుంటే.. చంద్రబాబు ప్రజల ఆదాయం పెంచుతున్నారు : ప్రత్తిపాటి

### 8,13, 14 వార్డుల్లో ఇంటింటికీ తెలుగుదేశంలో పాల్గొన్న ప్రత్తిపాటి
### రూ.52 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే






**చిలకలూరిపేట, పెన్ పవర్, ఆగస్టు 04:** జగన్ అధికారంలో ఉన్నన్నాళ్లు సొంత ఆదాయం పెంచుకుంటే... చంద్రబాబు రెండేళ్లలోనే ప్రజల జీవన ప్రమాణాలు, వారి తలసరి ఆదాయ పెంపునకు ప్రత్యేక ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంపై వేసిన అప్పులభారం తగ్గిస్తూనే, ప్రతినెలా ప్రజల సంతోష స్థాయి ఏమాత్రం తగ్గకుండా, సంక్షేమ పథకాలు అమలు చేయడం సామాన్య విషయం కాదన్నారు.

**3 వార్డుల్లో రూ.52లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రత్తిపాటి శంకుస్థాపన :** మంగళవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలోని 13, 14, 8 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా 8 వ వార్డులో రూ.29 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులకు, 13వ వార్డులో రూ.6.80 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, కల్వర్టు నిర్మాణానికి, 14వ వార్డులో రూ.16 లక్షలతో నిధులతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులకు స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాటి.. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పలుచోట్ల మాట్లాడారు.

**జగన్ ఐదేళ్లు తన ఆదాయంపై దృష్టిపెట్టి, రాష్ట్ర ఆదాయానికి గండికొట్టాడు :** గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా, భౌతికంగా విధ్వంసానికి గురిచేయకుండా ఉండుంటే.. నేడు ప్రజలు అభివృద్ధి పనుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉండేవి కావన్నారు. జగన్ సృష్టించిన ఆర్థిక విధ్వంసం వల్లే, నేడు ప్రజలు మరింత మెరుగైన సంక్షేమాన్ని, అభివృద్ధి ఫలాలు పొందడానికి ఆలస్యం అవుతోందన్నారు. జగన్ తన ఆదాయ పెంపు పై దృష్టి పెట్టి. రాష్ట్ర ఆదాయానికి గండికొట్టాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో చిలకలూరిపేట మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించాలని, ఆ దిశగా శ్రేణులు ఇప్పటినుంచే ప్రణాళికబద్ధంగా గెలుపు వ్యూహాలపై దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు ముల్లా కరిముల్లా, సయ్యద్ వహాబ్, మురకొండ మల్లిబాబు, కొత్త కోటేశ్వరరావు, హరిబాబు రెడ్డి, గోపిదేశి గంగాధర్, సుబ్బారావు, బీడింగ్ కరిముల్లా, బాజీ, బారి, వేటపాలెం సుభాని, నాగూర్ , కుంబా నాగేశ్వరరావు, వార్డు నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా గ్రంథాలయంలో మండలి శత జయంతి వేడుకలు



**మచిలీపట్నం,పెన్నుపవర్, జూలై 3:** మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యుడు, ఉమ్మడి రాష్ట్రాల మాజీ విద్యాశాఖ మంత్రి దివంగత మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు జిల్లా గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ,జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, సాహితి మిత్రుల సంస్థ కార్యదర్శి మేడిశెట్టి యోగేశ్వరరావు, ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి. రమేష్ విశ్రాంత జిల్లా లైబ్రరీ ఉద్యోగిఐ. వి. వి రామారావు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లంకిశెట్టి మాట్లాడుతూ ఉన్నత విలువలతో నీతి నిజాయితీతో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులుగా ఉమ్మడి రాష్ట్రాల విద్యాశాఖ మంత్రిగా పగల నిర్వహించిన మండల వెంకటకృష్ణారావు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయం అని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శతజయంతి ఉత్సవాలు జరపాలని జీవో జారీ చేయటం అభినందనీయమని బాలాజీ అన్నారు.జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు మాట్లాడుతూ దివిసీమ ఉప్పెనలో మండల చేసిన సేవలు మరువలేనివని ప్రపంచ తెలుగు మహాసభలను భారతదేశంలో మలేషియాలో నిర్వహించిన ఘనత మండలి కే దక్కిందని అన్నారు. మండలి వెంకటకృష్ణారావు ప్రాముఖ్యతను ఇతర వక్తలు తెలియజేశారు. మండల కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

## గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించిన మండలి వెంకట కృష్ణారావు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిష్టినా



**గుంటూరు , పెన్ పవర్, ఆగస్టు 4:** దివిసీమ గాంధీగా పేరొందిన మాజీ మంత్రి, గాంధేయవాది మండలి వెంకట కృష్ణారావు జన్మ శతాబ్ది ఉత్సవాలను జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిష్టినా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించిన మండలి వెంకట కృష్ణారావు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అవనిగడ్డ ఎమ్మెల్యేగా, బందరు లోక్‌సభ సభ్యుడిగా, రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ, విద్య, సాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా విశిష్ట సేవలు అందించారని తెలిపారు. 1975లో తొలి ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. దివిసీమ వరదల సమయంలో బాధితులకు అందించిన సేవల కారణంగా ఆయనకు "దివిసీమ గాంధీ"గా ప్రజల మన్ననలు లభించాయని పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. హెచ్. కృష్ణ, గణాంకాధికారి, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.అవసరమైతే దీనికి ఆకర్షణీయమైన ప్రధాన శీర్షిక, ఉపశీర్షికలు కూడా సిద్ధం చేస్తాను.

## జాతీయ చేనేత దినోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే కొండయ్య పరిశీలన



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 4:** ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల మండలంలో నిర్వహించనున్న "చేనేత సేవ" పథకం ద్వారా నేతన్నలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన సభా ప్రాంగణం, హెలీప్యాడ్ ఏర్పాట్లను చీరాల శాసనసభ్యులు కొండయ్య మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభ విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లపై అధికారులతో, నిర్వాహక కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్, సభా వేదిక, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలను ఎమ్మెల్యే పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు ఆకాంక్షించారు.

## ఇంటర్నేషనల్ కుంగ్ ఫు--కరాటే ఛాంపియన్షిప్‌లో న్యూ షావోలిన్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులకు పతకాల పంట



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 04 :** హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ ఇంటర్నేషనల్ లెవల్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్షిప్‌లో చిలకలూరిపేటకు చెందిన న్యూ షావోలిన్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. చిలకలూరిపేట సి.ఆర్ క్లబ్, ఎన్‌టీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న న్యూ షావోలిన్ కుంగ్ ఫు అకాడమీ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్ ఎల్.బి.నగర్‌లో జరిగిన 2వ ఇంటర్నేషనల్ లెవల్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్షిప్‌లో పాల్గొన్నారు. మాస్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ విభాగంలో సహస్ర, రెన్విక్, మోక్షిత, యుక్తిక, మానస, దేవర్ష, హరిశ్రీ, హర్షవర్ధన్, సాయి, గగన్, వేదాన్, సంతోష్, శశాంక్, అమన్ తమ తమ విభాగాల్లో ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలు సాధించారు. విజేతలకు చిలకలూరిపేట తహశీల్దార్ కె. వేణుగోపాల్ చేతుల మీదుగా పతకాలను అందజేశారు. అనంతరం స్థానిక సి.ఆర్ క్లబ్‌లో అభినందన సభ నిర్వహించి విజేతలను సత్కరించారు. కార్యక్రమంలో న్యూ షావోలిన్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్లు, మోడరన్ విద్యాసంస్థల అధినేత చేబ్రోలు మహేష్, సి.ఆర్ క్లబ్ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా చేబ్రోలు మహేష్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ముఖ్యంగా ఆడపిల్లలకు చిన్న వయసు నుంచే సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. మాస్టర్ విక్రమ్ మాట్లాడుతూ అకాడమీపై నమ్మకంతో విద్యార్థులను టోర్నమెంట్‌కు పంపిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తాము అందించిన శిక్షణకు తగ్గట్టుగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో అకాడమీకి గుర్తింపు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని చిలకలూరిపేటకు మరింత పేరు తీసుకువస్తామని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు చిలకలూరిపేట సి.ఆర్ క్లబ్ ఆవరణలో ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అకాడమీ చీఫ్ ఎస్.కె. దరియావలి, మాస్టర్ యడ్ల సురేష్, పాలపాటి నాగరాజ, కొర్రపాటి రాంబాబు, కుర్చేటి బ్రహ్మయ్య, కాకి ప్రసాద్, ఇన్‌స్ట్రక్టర్లు ఎస్.కె. రబ్బాని, కె. రాహుల్, సాకేత్, సుధీర్, ఖమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో వల్లపు చెరువు అభివృద్ధి పనులు పురోగతి

### పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 04 :** పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన వల్లపు చెరువు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు . ప్రధానమంత్రి కృషి యోజన (గ్రామీణ) 2.0 కింద రూ. 1.30 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మే 22న అధికారికంగా పనులు ప్రారంభించారు. తొలి విడతగా రూ. 50 లక్షల నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం చెరువు వద్దకు వెళ్లిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పల్నాడు జిల్లా డ్వామా పీడీ ఎం.సిద్ధాలింగమూర్తి పాల్గొన్నారు. అధికారులను పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకుని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలోని చారిత్రక వల్లపు చెరువును మోడల్ ట్యాంక్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రధానమంత్రి కృషి యోజన 2.0 నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీటి భద్రత, భూగర్భ జలాల పెరుగుదల, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన విహార వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చెరువులో పూడికతీత, ట్యాంక్‌బండ్ బలోపేతం, రిటైనింగ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పరిసర ప్రాంతాల శుభ్రత వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తదుపరి దశలో ఇరువైపులా మొక్కల పెంపకం, సోలార్ లైటింగ్, పెద్దల కోసం బెంచీలు, చిన్నారుల కోసం పార్క్, బోటింగ్ సౌకర్యం వంటి ఆధునిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. చెరువు మధ్యలో శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మొత్తం ప్రాంతాన్ని ఆకర్షణీయమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించినట్లు అయన తెలిపారు. అదనంగా ప్రభుత్వ నిధులతో పాటు ఎన్‌ఆర్‌ఐల స్వచ్ఛంద సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గుడి కమిటీ చైర్మన్ పాండురంగారావు, అధికారులు, టీడీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాలను పిల్లలుఆడుకోవడానికి వీలుగా, ప్రత్యేక స్పోర్ట్స్ థీమ్ కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 04 :** మంగళవారం ఉద్యోగనగర్, వేణుగోపాల్ నగర్, మధురా నగర్, బాపయ్య నగర్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో జిఎంసి ఖాళీ స్థలాలను పరిశీలించి, అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పిల్లలు ఎక్కువగా డిజిటల్ పరికరాలకే పరిమితమవుతున్నారని, వారి శారీరక దారుఢ్యానికి మరియు మానసిక వికాసానికి ఆట స్థలాలు, క్రీడలు ఎంతగానో అవసరమని పేర్కొన్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, వివిధ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగంలో లేని నగరపాలక సంస్థ స్థలాలను ప్రజలకు మరియు పిల్లలకు ఉపయోగపడేలా సుందరీకరించి, ఒక్కో పార్క్ ఒక్కో థీమ్ తో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఆయా స్థలాల గుర్తింపు పూర్తయిందని, ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించి, బౌండరీలు ఫిక్స్ చేసి, ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నివాసాలకు దూరంగా ఉన్న స్థలాలకు ఫెన్సింగ్ చేసి మొక్కలు నాటి, జిఎంసి బోర్డ్ లు ఏర్పాటు చేయాలన్నారు.



పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిసిపి సూరజ్ కుమార్, ఈఈ వేణుగోపాల్, ఏసిపీ రెహ్మాన్, డిఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజల ముంగిట ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి నివేదిక



**గూడూరు, పెన్ పవర్, ఆగష్టు 4 :** గూడూరు గ్రామంలోని 34వ బూత్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గోపి నాగబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్, అన్న క్యాంటీన్లు, పెన్షన్ల పెంపు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్.ఏ. బేగ్, పీఏసీఎస్ అధ్యక్షుడు తలుపుల కృష్ణ, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, మండల టీడీపీ కార్యదర్శి యారా ప్రసాద్, సీహెచ్‌సీ హాస్పిటల్ డైరెక్టర్ బేతల స్వామి, గూడూరు జనసేన పార్టీ అధ్యక్షుడు బాసంశెట్టి విజయ్, గొరిపర్తి మాధవరాజు, దావు నాని, ఖాజా తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం -బాధితులకు భరోసా

### మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ





**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 04 :** మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి కేసులను మరింత సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పల్నాడు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులకు మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి బాధితులను గుర్తించడం, సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించడం, కీలక ఆధారాలను సేకరించడం, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా భారతీయ న్యాయ సంహిత--2023, వెట్టిచాకిరి నిర్మూలన చట్టం--1976, పోక్సో చట్టం--2012, బాలల న్యాయ చట్టం--2015, అనైతిక రవాణా నిరోధక చట్టం--1956 తదితర చట్టాల అమలుపై వివరించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టుదాం -- ప్రతి మనిషి స్వేచ్ఛను కాపాడుదాం అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హ్యాండ్ ఆఫ్ కంపాషన్ సంస్థ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను కలిసిన టిడిపి ఎంపీల బృందం

### అమరావతి పుస్తకం అందజేత



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 04 :** పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు తన సహచర టీడీపీ పార్లమెంటు సభ్యులతో కలిసి మంగళవారం భారత ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతి : బిల్ట్ బై ది పీపుల్ , సెక్యూర్డ్ బై దిష్టినీ పేరుతో రూపొందించిన పుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందజేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాల వారసత్వం నుంచి, రాజధాని పరిరక్షణ కోసం అమరావతి రైతులు, మహిళలు 1,631 రోజుల పాటు చేసిన సుదీర్ఘ పోరాట విశేషాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. అలాగే 2024 జూన్ 2 నుంచి అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా పునరుద్ధరించిన చారిత్రక పరిణామాలు ఈ పుస్తకంలో వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని ఎంపీ వెల్లడించారు.

## నేడు ఆలయ భూముల వేలం

**బెల్లంకొండ ఆగస్టు 4 పెన్ పవర్:** బెల్లంకొండ మండలం కేతవరం గ్రామం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములు 11 సంవత్సరాల కౌలుకు ఈనెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మండల దేవాదాయ శాఖ అధికారి ఎస్ కోటిరెడ్డి తెలిపారు దేవదాయ శాఖ ఉప కమిషన్ సమక్షంలో ఈ వేలం పాట నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు 2026 27 నుండి 236 37 వరకు మొత్తం 11 సంవత్సరాల కాలానికి కవులు హక్కులను వేస్తున్నట్లు తెలిపారు ఈ వేళలో పాల్గొనవారు ప్రతి పాటకు 25 వేలు డ్రాఫ్ట్ డిడి ను శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కేతవరం పేరున చెల్లించి ఈ టెండర్ కం షీల్డ్ టెండర్ లో పాల్గొనవలసిందిగా కోరారు

## అనారోగ్యంతో మనస్థాపం చెంది వివాహిత ఆత్మహత్య



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 04:** మండలంలోని వేలూరు గ్రామంలో అనారోగ్య సమస్యలతో మనస్థాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వేలూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అలా పవన్ కుమార్ భార్య దివ్య సాయి (22) గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ, చిన్న పనులకే అలసిపోతుండటంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఈ క్రమంలో జులై 30వ తేదీన ఇంట్లో ఎలుకల మందు తిన్నది. మరుసటి రోజు ఆమెకు వాంతులు కావడంతో గమనించిన తండ్రి వంశీకృష్ణ.. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం (ఆగస్టు 4న) ఉదయం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై జి.అనిల్ కుమార్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## ప్రతి డివిజన్‌కు రూ.10 కోట్ల అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు, 4 :** పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో రూ.10 కోట్లకు తగ్గకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం 33వ డివిజన్‌లో మొత్తం రూ.1.19 కోట్ల విలువైన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఆర్సీసీ కల్వర్టుల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. బ్రాడిపేట 2/17 ప్రాంతంలో రూ.77 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, లక్ష్మీపురం--పండరిపురం మార్గంలో రూ.42.80 లక్షలతో సీసీ డ్రెయిన్లు, ఆర్సీసీ కల్వర్టుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు పశ్చిమలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తూ అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. 33వ డివిజన్‌లో ఇప్పటికే రూ.5 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.3 కోట్ల పనులు టెండర్ల దశలో ఉన్నాయని తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను కూడా అర్హులందరికీ అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామన్నపేటలో కనకనాగారపమ్మ తల్లి పొంగళ్ళు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 4 :** చీరాల పట్టణంలోని రామన్నపేటలో వెలసిన శ్రీ కనకనాగారపమ్మ తల్లి దేవస్థానంలో సోమవారం నిర్వహించిన అమ్మవారి పొంగళ్ళు, మొక్కులు చెల్లించుకునే కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గొల్లపల్లి వెంకటేశ్వరరావు (మార్కెట్ జీవీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కు ఘన స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులతో ఆయన ఆత్మీయంగా పలకరించి, కనకనాగారపమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కారం చేయండి



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 4 :** జొన్నవాడ ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని మెడికల్ ఆఫీసర్ దృష్టి కి తీసుకు వచ్చి పరిష్కారం చేయమని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి రాధయ్య చల్లకొలుసు మల్లికార్జునరావు, సిపిఎం పార్టీ నాయకులు తంబి రమణయ్య, మద్దిశెట్టి సురేష్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తల సమస్యలు పట్టించుకోవడం లేదు

### సీనియర్ నేత ఆవేదన ఫోటోలకే పరిమితమైన బిజెపి



**పెన్ పవర్ ప్రతినిధి చేజర్ల, ఆగస్టు 4 :** చేజర్ల మండలంలో భారతీయ జనతా పార్టీ నిర్వీర్యమైపోతోందని, కార్యకర్తలను పట్టించుకునే నాథుడే లేడని పార్టీ సీనియర్ నాయకుడు కుంకు బాలయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటు చేసి ఎంతో కృషి చేశానని తెలిపారు. కానీ ఇప్పుడు పదవులు తీసుకున్న నాయకులు ఏ కార్యక్రమం జరిగినా సమాచారం ఇవ్వడం లేదని, కార్యకర్తల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. "పదవులకే పరిమితమైన నాయకుల తీరు వల్ల పార్టీ క్యాడర్ మొత్తం అసంతృప్తితో ఉంది. ఇప్పటివరకు మండలంలో గ్రామ కమిటీలు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంది" అని ఆయన పేర్కొన్నారు. పార్టీ ముఖ్య నాయకులు తమ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని, ఫోటోలకే పరిమితమైన దీజీపీ ముందు ముందు ఎలా బలోపేతం అవుతుందో అర్థం కావడం లేదని బాలయ్య నాయుడు అన్నారు.

# పల్నాడులో 'టెట్'కు పక్కా ఏర్పాట్లు

### జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె. రామారావు

**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 04 :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టి.ఇ.టి –2026) నిర్వహణకు పల్నాడు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డిఈఓ) పి.వి.జె. రామారావు వెల్లడించారు. మంగళవారం అయిన మాట్లాడుతూ ఆగస్టు 5 నుండి 16వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి అని తెలిపారు.

**పరీక్ష కేంద్రాలు - అభ్యర్థుల వివరాలు :** జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,194 మంది అభ్యర్థులు టెట్ పరీక్షకు హాజరుకానున్నారన్నారు. వీరి కోసం 5 కేంద్రాలను ఏర్పాటు చేశారని చెప్పారు.

**కళాశాల వివరాలు :** ఏ.ఎం. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల: 4,334 మంది. నరసరావుపేట ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ: 1,867 మంది, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల: 1,704 మంది, తిరుమల ఇంజనీరింగ్ కళాశాల: 1,420 మంది, ఎం.ఏ.ఎం. కళాశాల: 310 మంది.

**ముఖ్యమైన నిబంధనలు ఉ పరీక్ష సమయాలు మొదటి సెషన్:** ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:00 వరకు, రెండో సెషన్: మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 వరకు. కేంద్రంలోకి అనుమతి: ఉదయం సెషన్ కోసం 8:30 నుండి 9:30 వరకు, మధ్యాహ్నం సెషన్ కోసం 1:30 నుండి 2:30 వరకు మాత్రమే అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. కాబట్టి అభ్యర్థులు కనీసం గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని అయన సూచించారు. కావాల్సిన పత్రాలు: అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ మరియు చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. మౌలిక వసతులు ఉ ప్రత్యేక సదుపాయాలు అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు అందుబాటులో ఉంచడమే కాకుండా భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈసారి ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ రాస్తున్నందున, ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని డిఈఓ కోరారు. దివ్యాంగ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక సదుపాయాలతో పాటు 50 నిమిషాల అదనపు సమయం కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులందరూ ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి మంచి విజయం సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు ఆకాంక్షించారు.

# మహిళల్లో అవగాహన పెంపుతోనే వేధింపులకు అడ్డుకట్ట

### రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ





**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 04 :** స్టాకింగ్, సైబర్ స్టాకింగ్ వంటి మహిళలపై వేధింపులు తీవ్రమైన నేరాలని, వాటిని చిన్న విషయంగా తీసుకోకుండా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. ఎస్‌కేయూ ఇంజినీరింగ్ విభాగ సమావేశ మందిరంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక వ్యక్తిని పదేపదే వెంబడించడం, అనవసరంగా ఫోన్ కాల్స్, మెసేజ్‌లు చేయడం, సోషల్ మీడియాలో వేధించడం, నకిలీ అకౌంట్లు సృష్టించి ఇబ్బంది పెట్టడం వంటి చర్యలన్నీ స్టాకింగ్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ప్రస్తుతం సైబర్ స్టాకింగ్ కేసులు పెరుగుతున్నాయని, బాధితులు ఆధారాలను భద్రపరచి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవగాహన లేకపోవడం వల్ల అనేక మంది యువతులు, మహిళలు మానసిక వేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి సుప్రజ, సీనియర్ ఏపీపీ ఎన్.సి. సంగీత, మానసిక నిపుణులు డా. సురేఖ తదితరులు స్టాకింగ్‌కు సంబంధించిన చట్టాలు, మానసిక ప్రభావాలు, నివారణ చర్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళల భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు డా. రాయపాటి శైలజ తెలిపారు.అవసరమైతే దీనికి మరింత ఆకర్షణీయమైన పెన్ పవర్ శైలి ప్రధాన శీర్షిక, ఉపశీర్షికలు, ఫోటో క్యాప్షన్ కూడా సిద్ధం చేస్తాను.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలి

### వైఎస్సార్ కాంగ్రెస్ డిమాండ్



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 4:** డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం చీరాల మండలం రామకృష్ణా పురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో టౌన్ హాల్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ బాబు మాట్లాడుతూ డీఎస్సీ నియామక ప్రక్రియలో తీవ్ర అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీబీఐతో నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని సదస్సులో పాల్గొన్న పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గానికి చెందిన పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ వినియోగంపై విద్యార్థినులకు అవగాహన




**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 4 :** చీరాల పోలీస్ స్టేషన్ పరిధిలోని మేధావి జూనియర్ కళాశాలలో చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ సూచనలతో చీరాల సీఐ సోమశేఖర్, ఎస్ఐ హరిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం.వి. దుర్గాకుమార్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఏవో అవినాష్, వైస్ ప్రిన్సిపాల్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిబాబు, శక్తి బృందం కానిస్టేబుల్ కె. సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థినులపై జరిగే ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని సూచించారు. బస్టాప్‌లు, విద్యాసంస్థల పరిసరాలు, ప్రజా ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి సంఘటనలు ఎదురైతే వెంటనే శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ సదుపాయాన్ని వినియోగించడంతో పాటు 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళల భద్రతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, వేధింపుల రహిత విద్యా వాతావరణం ఏర్పాటుకు అందరూ సహకరించాలని వారు పిలుపునిచ్చారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకుని తమ హక్కులను తెలుసుకోవడం ద్వారా సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, శక్తి బృందం సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా ఎంపికలు



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 04 :** యార్కర్ క్లబ్ సి ఆర్ కాలనీ లోని పల్నాడు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 17 బాలుర బాలికల విభాగాలలో ఎంపికలు నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు . జిల్లా నలుమూలల నుండి వివిధ పాఠశాల వేద పాఠశాల ఏపీ మోడల్ స్కూల్ తిరుమల ఆక్స్ఫర్డ్ జూనియర్ కాలేజీ పిడుగురాళ్ల వాగ్దేవి జూనియర్ కాలేజీ వసిస్ట్ జూనియర్ కాలేజ్ సత్తెనపల్లి హోలీ ఫ్యామిలీ స్కూల్ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ చైతన్య లిటిల్ గ్రీన్ వ్యాలీ నారాయణ శారద మోడ్రన్ స్టెల్లార్ జి విట్ పాఠశాల నుండి 100 మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి బాపట్ల లోనీ కె వి ఆర్ డిగ్రీ కాలేజ్ కాజీ పాలెంలో ఆగస్టు8, 9 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు . కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రెసిడెంట్ కాసింబుడే ప్రారంభించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో వేద పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి మనోహర్ గురునాథ్ , వ్యాయామ ఉపాధ్యాయులు ఏ ఎం జి రాజు వేద స్కూల్ పిఈటి మనోహర్, మోడ్రన్ నవీన్ , నారాయణ పి ఈ టి కృపారావు గ్రీన్ వ్యాలీ పి ఈ టి శ్యామ్ చైతన్య లిటిల్ ఫణీంద్ర కోచ్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

## మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 04 :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో మహిళల నుంచి పలు వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు స్థల వివాదాలు, పెన్షన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. వినతులన్నింటినీ పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోశాలలకు విరాళాలు



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 4 :** చీరాలలోని ఎన్.ఆర్. ఉ పి.ఎం. హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వాకింగ్ సభ్యుడు ముంగిర శ్రీనివాసరావు తన వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గోశాలలకు ఆర్థిక సహాయం అందించారు. గోవుల సంరక్షణ, పోషణకు చేయూతగా శ్రీకృష్ణ గోశాలకు రూ.1,500, శ్రీ మహాదేవ వేద గోశాలకు రూ.1,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ముంగిర శ్రీనివాసరావు సేవాభావాన్ని కొనియాడుతూ, ఆయన చేపట్టిన ఈ కార్యక్రమం ఇతరులకు స్ఫూర్తిదాయకమని అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ల గురుప్రసాద్, నారాయణమూర్తి, కొమ్మూరి వీరాంజనేయులు, చక్క నారాయణ, శీరాం రమేష్, తుకారాం, తారక రామారావు, కాటమరాజు, శ్రీరామమూర్తి, లాల్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల పాలనపై ప్రశ్నించేందుకు "సిద్ధం "



**పెడన, పెన్ పవర్, ఆగష్టు 4 :** డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పెడన నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ ఉప్పాల రాము డిమాండ్ చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఆయన అన్నారు. అలాగే కృష్ణా డెల్టాకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో సాగునీటి కోసం నిరాహార దీక్ష చేపడతామని ఉప్పాల రాము హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి నాయకులు కటకం నాగ కుమారి ప్రసాద్,పిచ్చుక సతీష్, సిరివెళ్ల జేయష్, కోమట్ల అనిల్, రౌతుల ప్రసాద్, నాలుగు మండలాల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, ఆర్ బి కే చైర్మన్లు , మాజీ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, కార్యకర్తలు వార్డు మెంబర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొలాలు వద్ద ఉన్న ట్రాన్స్ఫారం ఖాళీ



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 4 :** బుచ్చిరెడ్డిపాలెం మండలం పురంధపురం గ్రామంలో పొలాలు వద్ద ఉన్న ట్రాన్స్ఫర్ కాళీ వారం గడుస్తున్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. మోటార్ల ద్వారా 10 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. నీరు లేక తాము వేసిన పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి.

### విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి: మాజీ మంత్రి విడదల రజిని

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 04:** రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన "ఏపీ జిఈఎన్-జెడ్ డబల్యూ ఏ ఆర్" టౌన్ హాల్ సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించి వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడిన ఈ వ్యవహారంలో పూర్తి పారదర్శకత కోసం డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొంటూ, నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. అదేవిధంగా, రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులకు అందాల్సిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులు కొనసాగించలేని పరిస్థితి నెలకొనడం అత్యంత దురదృష్టకరమని



పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. యువతను నమ్మించి అధికారంలోకి వచ్చి ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించడం అన్యాయమని పేర్కొంటూ, వెంటనే నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7, 8, 9 తేదీలలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా, చిలకలూరిపేట నియోజకవర్గంలో కూడా రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి విడదల రజిని ప్రకటించారు. డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ చేపట్టాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆగస్టు 10న చిలకలూరిపేట పట్టణంలో నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని విద్యార్థులు, నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు, ప్రజలకు పిలుపునిచ్చారు. డీఎస్సీ అక్రమాలకు వ్యతిరేకంగా, యువత హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించే ఈ భారీ ర్యాలీలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులు, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని మాజీ మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. ఈ టౌన్ హాల్ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సమావేశంలో యువత తమ సమస్యలు, సూచనలను వెల్లడించగా, వాటి పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని మాజీ మంత్రి విడదల రజిని తెలిపారు

## పీహెచ్‌సీని సందర్శించిన డిఎంహెచ్ఓ రత్నమోహన్



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 04 నాదెండ్ల :** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ రత్నమోహన్ సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల తీరును వైద్యాధికారి డాక్టర్ శ్వేతను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామాల్లో వ్యాక్సినేషన్‌తో పాటు 'కిల్కారి' సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఈవోపై అవినీతి ఆరోపణల విచారణ

### గూడూరులో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆరా



**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 4:** గూడూరు పరిసర ప్రాంతాల దేవాలయాల ఈవో ముసునూరి రవికృష్ణపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. శ్రీ మూలస్థానేశ్వర స్వామి శివాలయం చైర్మన్ ఆరికట్ల బాలకృష్ణ నాయుడు, బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ నిర్వహించారు. విచారణ సందర్భంగా ఆలయ ఖాతాల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం, పూజారులకు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం, సిబ్బందిపై అనుచిత ప్రవర్తన వంటి అంశాలను ఆలయ కమిటీ సభ్యులు లిఖితపూర్వకంగా అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పలు దేవాలయాలకు సంబంధించిన అవినీతి ఆరోపణలు, ఈవో కార్యాలయంలో మద్యం సేవించిన సిబ్బంది సస్పెన్షన్‌కు సంబంధించిన వివరాలపై కూడా ఆరా తీశారు. విచారణ అనంతరం అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

## దోస్తువ్యాన్ ద్విచక్ర వాహనం ఢీ



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 4 :** బుచ్చిరెడ్డిపాలెం పట్టణం కెనరా బ్యాంక్ వద్ద ముంబై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు వైపు వెళ్తున్న దోస్తు వాహనాన్ని బుచ్చివైపు వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహదారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. 1033 టోల్ ప్లాజా ఆంబులెన్స్ లో బుచ్చి హాస్పిటల్స్ కి తరలించగా మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఎదురుగా వస్తున్న దోస్త్ వాహనాన్ని ద్విచక్ర వాహనదారుడే ఢీకొట్టాడని స్థానికులు తెలిపారు.

## 100% పూర్తిచేసిన బి ఎల్ ఏ లకు అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 4 :** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి డి 2 డి కార్యక్రమంలో ప్రజలకు వివరించడంలో 100% పూర్తి చేసిన బి ఎల్ ఏ లకు అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా బుచ్చి రూరల్ సంబంధించి 55% పూర్తి చేసి దామరమడుగు 72,74మినగల్లు 61,62 బూత్ లలో 100% పూర్తిచేసిన బి ఎల్ ఏ లను అభినందించారు. సంక్షోభంలోను సంక్షేమ అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో ముందడుగులో ఉన్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు విశేషంగా లభించడం ఆనందంగా ఉందని తెలియజేశారు. అన్ని మండలాల్లోనూ విజయవంతంగా పూర్తి చేసి ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను బి ఎల్ ఏ లు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## జొన్నవాడ కామాక్షమ్మ దేవస్థానంలో హుండీ లెక్కింపు






**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 4 :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన జన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానము నందు సోమవారం హుండీలు లెక్కింపు కార్యక్రమం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, చైర్మన్ మరియు ధర్మకర్త మండలి సభ్యులు, దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి సమక్షంలో హుండీలు తెరిచి భక్తులు శ్రీవార్లకు సమర్పించిన కానుకలను లెక్కించారు. తేదీ 18.05.2026 నుండి తేదీ 03.08.2026 వరకు అనగా 78 రోజులకు గాను శ్రీ వార్ల ప్రధాన ఆలయ హుండీలు ద్వారా ఆదాయంహొరూ. 47,01,330/- యూఎస్ డాలర్ 20, చైనా యువాన్ 10, నేపాల్ రూపాయి 10, బంగారు వస్తువులు 90 గ్రాములు, వెండి వస్తువులు 191 గ్రాములు, అన్నప్రసాద హుండీ ద్వారా రూ. 2,33,771/- భక్తులు శ్రీవార్ల హుండీ ద్వారా సమర్పించారు. ఈ కార్యక్రమములో బి నాగమల్లేశ్వర రాజు పర్యవేక్షణాధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ, కోవూరు, దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు కీలుకుప్ప శ్రీనివాసులు గారు, జొన్నవాడ వి ఆర్ ఎ శ్రీ ఆలం ముని కృష్ణ యం వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ, బుచ్చిరెడ్డిపాలెం పి ఎస్, స్థానిక ఏపీజీ బ్యాంక్ అధికారులు, ఆలయ సిబ్బంది మరియు ఎస్. సుబ్బారాయుడు అధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు, సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్ ధర్మకర్త మండల సభ్యులు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి సహాయ కమీషనరు కార్యనిర్వహణాధికారి

## ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పాదయాత్రల గోడపత్రికల ఆవిష్కరణ




**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 4:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 6 నుంచి 16 వరకు జిల్లా వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి తెలిపారు. గూడూరు పట్టణంలోని కటకరాజా వీధిలో ఉన్న సీపీఐ కార్యాలయం ఎదుట మంగళవారం పాదయాత్రల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరిగెల సాయి మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఐతో పాటు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్రలు చేపట్టి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. పాదయాత్రల సందర్భంగా ప్రజల నుంచి స్వీకరించిన వినతిపత్రాలను ఈ నెల 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా సందర్భంగా అధికారులకు అందజేస్తామని వెల్లడించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, పట్టణ కన్వీనర్ సునీల్ మాట్లాడుతూ గూడూరులో అన్ని వర్గాల సమన్వయంతో పాదయాత్రలను విజయవంతం చేస్తామని తెలిపారు. అలాగే సెప్టెంబర్ 1న నిర్వహించనున్న "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ మాజీ కార్యదర్శి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు సీవీఆర్ కుమార్, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కొమ్మి నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్లు (సీవీఎల్), భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మీరా, బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి నందవనం శ్రీనివాసమూర్తి, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, అన్వేష్, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటయ్య, ఎన్బీకేఆర్ నాన్-టీచింగ్ స్టాఫ్ గౌస్ భాయ్, ఏరియా ఆస్పత్రి హెల్పర్స్ యూనియన్ నాయకులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ప్రజా నాట్య మండలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి అండగా సీఎంఆర్ఎఫ్

### కోవూరులో 49 మందికి రూ. 42.17 లక్షల చెక్కులు పంపిణీ

**పెన్ పవర్ ప్రతినిధి కోవూరు, ఆగస్టు 4 :** అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పెద్ద దిక్కుగా నిలుస్తోందని కోవూరు శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె 49 మంది లబ్ధిదారులకు రూ. 42.17 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తరఫున రూ. 8.16 లక్షల ఆర్థిక సాయాన్ని కూడా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కోవూరు నియోజకవర్గంలో 27 సార్లు సీఎంఆర్ఎఫ్ పంపిణీ నిర్వహించి, ఇప్పటివరకు దాదాపు రూ. 10.50 కోట్ల మేర పేదలకు వైద్య సహాయం అందించినట్లు తెలిపారు. పేదలను ఆదుకుంటున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.




**46% ఇళ్ల సందర్శన పూర్తి :** ప్రభుత్వం చేపట్టిన '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నియోజకవర్గంలో 46 శాతం ఇళ్లను సందర్శించినట్లు వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను దాదాపు 99 శాతం అమలు చేసినట్లు వివరించారు.

**రూ. 780 కోట్లతో అభివృద్ధి :** గడిచిన రెండేళ్లలో కోవూరు నియోజకవర్గంలో దాదాపు రూ. 780 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. 82 పంచాయతీల్లో, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం పట్టణ వార్డుల్లో ప్రధాన సమస్యలు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

## 6 మాసాల వరకు విధిగా తల్లిపాలే పట్టించాలి : సూపర్వైజర్ అంకమ్మ



**దొరవారి సత్రం: పెన్ పవర్, ఆగష్టు 4 :** ప్రతి తల్లి జన్మనిచ్చిన బిడ్డకు విధిగా తల్లిపాలనే పట్టించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అంకమ్మ సూచించారు. మంగళవారం దొరవారి సత్రం మండల పరిధిలోని బూదూరు అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లులతో మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే తప్పక తల్లి పాలను పట్టిస్తూ, ఆరు మాసాల వరకు కొనసాగిస్తే తల్లిపాలు బిడ్డకు అమృతంగా పని చేస్తుందని అన్నారు. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. అంతేకాకుండా అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లుగా బిడ్డకు తల్లిపాలన కొనసాగించాలని పేర్కొన్నారు. గర్భిణి, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో సరఫరా చేసే పోషక విలువలు కలిగిన పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని తెలియజేశారు. ప్రతి వ్యక్తికి దినసరి అవసరమైన కేలరీల శక్తి పొందాలంటే సమ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను దినసరి ఆహారంలో తీసుకోవాలన్నారు. గుడ్డు, వేరుశెనగ చిక్కీలు, రాగి పిండిలో ఐరన్ కలిగిన పోషకాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భవతి, బాలింతలు పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాది కి సన్మానించిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 4 :** అల్లూరు మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది మిరియాల శ్రీనివాసులు రెడ్డి కోవూరు కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన సందర్భంగా నేడు అల్లూరు లోని వారి నివాసానికి వెళ్లి శ్రీనివాసులు రెడ్డి సన్మానించి పుష్పగుచ్చాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రివర్యులు వైసీపీ రాష్ట్ర పాక్ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాజీ శాసనసభ్యులు వైసీపీ రాష్ట్ర సి ఈ సి సభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఈ కార్యక్రమంలో అల్లూరు నగర పంచాయతీ అధ్యక్షులు దండా కృష్ణారెడ్డి , వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలం వెంకట సాయికుమార్ అల్లూరు రూరల్ మండల అధ్యక్షులు బీదా రమేష్ బాబు అల్లూరు నగర పంచాయతీ ఉపాధ్యక్షులు షేక్ ఉస్మాన్ షరీఫ్ అల్లూరు నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శులు మేడ నిరంజన్ రెడ్డి చింతాటి కరుణాకర్ రెడ్డి పెనుమల్లి ప్రతాప్ రెడ్డి నగర పంచాయతీ బీసీ సెల్ అధ్యక్షులు మేడ మాధవ నగర పంచాయతీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మేడా శివప్రసాద్ రెడ్డి వైసీపీ నాయకులు సోమ వంశీకృష్ణ దాసరి శ్రీహరి కొల్లు శ్రీనివాసులు ఆమాన మధు న్యాయవాదులు గోమటం శ్యామాచార్యులు బలంరెడ్డి చెంచు రెడ్డి చేరుపాటి శ్రీనివాసులు రెడ్డి మేకల మల్లికార్జున బాబు బొమ్మ సతీష్ రెడ్డి గోమాటం బాలక్రిష్ణ చీమకుర్తి సృజన వంగవరపు కావ్య వంగవరపు చైతన్య వైసీపీ నాయకులు మవులూరు శ్రీనివాసులు రెడ్డి పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి శివుడి నరసింహారెడ్డి రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి అత్తిపల్లి అనూప్ రెడ్డి పాల్గొన్నారు.

# నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు

**విజయవాడ, ఆగస్టు 4, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లోకేష్ క్రియాశీలక పాత్ర పోషిస్తుండటం అందరికి తెలిసిందే. అధికార పక్షంలో ఆయనే కీలకమయ్యారు. ప్రతిపక్షం కూడా ఆయన పైనే గురి పెట్టింది. దాంతో లోకేష్ గ్రాఫ్ పెరిగింది.ముఖ్యమంత్రి చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దాటాయి. ఇప్పటికే అయన నాలుగు సార్లు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేశారు. 16 ఏళ్ళు ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. అయితే రాబోయే కాలంలో తన కుమారుడు లోకేష్ ను ముఖ్యమంత్రిని చేయాలని భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ పదవి అప్పజెప్పారు. పార్టీ కీలక అంశాలని కుమారుడికి అప్పగించేశారు. ఇక మిగిలింది పట్టాభిషేకం. పరిపాలనా అనుభవం కోసం విదేశాలు తిప్పుతున్నారు.
తరచుగా ఢిల్లీకి పంపిస్తున్నారు. కేంద్రంలోని మంత్రులతో మాట్లాడిస్తున్నారు. ప్రభుత్వంలో తీసుకునే కీలక నిర్ణయాలలో లోకేష్ ను ఇన్వాల్వ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాబోయే కాలంలో లోకేష్ ముఖ్యమంత్రి కావడం ఖాయంగా కనిపిస్తుంది.ప్రతిపక్ష వైసీపీ లోకేష్ ను టార్గెట్ చేసుకొని రాజకీయాలు చేస్తుండడం గమనించవచ్చు. నిన్నా మొన్నటి వరకు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించిన వైసీపీ ఇప్పుడు డీఎస్సి అక్రమాల గురించి పోరాటం స్టార్ట్ చేసింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరహాలోనే లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేసింది.అంటే భవిష్యత్తులో తాము లోకేష్ తోనే పోరాడాల్సి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థిర నిర్ణయానికి వచ్చారని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను సైతం పక్కన పెట్టి లోకేష్ పై బాణం ఎక్కు పెట్టడం దీనికి నిదర్శనమని పేర్కొంటున్నారు . మొత్తం మీద అటు అధికార పార్టీ లోకేష్ చుట్టూ తిరుగుతుంటే ఇటు ప్రతిపక్షం కూడా లోకేష్ కేంద్రంగానే విమర్శలు గుప్పిస్తుండడం విశేషం.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# ఆశావహులు.. అదుపు తప్పుతున్నారా

**కాకినాడ, ఆగస్టు 4, పెన్ పవర్:**
టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? స్థానికంగా తన హవాను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానమే టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. కాకినాడ పోర్టును విస్తరించే పనులకు ఆయన సుముఖంగానే ఉన్నా.. పార్టీ పరంగా ఆయన వ్యవహరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. కాకినాడ పోర్టకు కోన పోర్టుగా పేరు పెట్టాలన్నది యనమల డిమాండ్. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న పైగా ఎవరికీ లేని ఈ డిమాండ్ విషయంలో యనమల స్థానికతను పురిగొల్పుతున్నారు. పోర్టుకు అవసరమైన భూములు ఇస్తోంది కోనసీమ ప్రాంత రైతులని, కాబట్టి.. పోర్టుకు కోన పేరు పెట్టాలన్నది యనమల సూచన. ఇదే ఇప్పుడు డిమాండ్‌గా మారుతోంది. ఈ నెల 20లోగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కోన పోర్టుగా పేరు నిర్ధారించాలని.. లేకపోతే, ప్రజల ఆకాంక్షల మేరకు తాను కూడా వ్యవహరిస్తానని చెప్పు కొచ్చారు. ఈ వ్యవహారంపై ఆయన ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. తాజాగా స్థానికులతో భేటీ కావడం మరింత ఆసక్తిగా మారింది. కోన సీమ రైతు ల నుంచి భూములు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు కాకినాడ పోర్టు అని పేరు ఎందుకని ఆయన చెబుతున్నారు. అయితే.. వాస్తవానికి.. భూములు తీసుకున్నంత మాత్రాన అదే పేరును ఉంచాలని ఏమీ లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ.. యనమల మాత్రం తన దారి తనదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఇది పెద్ద ఉద్యమంగా మారాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాధాన్యం కొరవడడంతోనే.. ఇటు పార్టీలోను, అటు ప్రభుత్వంలోనూ యనమల ప్రాధాన్యం ఒకప్పుడు ఉన్నట్టుగా ఇప్పుడు లేదు. గతంలో తిప్పిన చక్రం.. ఇప్పుడు మూలబడినట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్సీగా రిటైరైన తర్వాత.. రాజ్యసభ ఆశించారు. లేదా గవర్నర్ గిరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు చేజారుతున్నా యి. పైగా తన ముందు రాజకీయాల్లోకి వచ్చిన వారికి పదవులు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ తనను పూర్తిగా పక్కన పెడుతోందని గ్రహిస్తున్న ఆయన.. ఇలా.. కీలక విషయాలపై ఫోకస్ చేశారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

## వేమండలో '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం'
## పాల్గొన్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో సోమవారం నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంతకుముందు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గన్నవరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గుడివాడ - కలవపాముల, తరిగొప్పల - మానికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రహదారులలో సుమారు 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వేమండ గ్రామంలో ఇప్పటికే ఆరు సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, హెడ్ పంప్ ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ.37 లక్షల వ్యయంతో 250 విద్యుత్ స్తంభాల మార్పిడి, ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు, రూ.12 లక్షలతో వ్యవసాయ విద్యుత్ సేవల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.1.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కలవపాముల రహదారి అభివృద్ధికి సుమారు రూ.1.70 కోట్లుఅవసరమవుతున్నాయని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు కూడా ప్రాధాన్యమిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజలు కోరిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉంగుటూరు మండల తహసీల్దార్ జలాది విమల కుమారి, ఎంపీడీవో ఈ సత్య కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తోట నాగభూషణం, కాపుదాసి సునీల్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, తేలప్రోలు పిఏసిఎస్ చైర్ పర్సన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఉయ్యూరు మురళి, బెజవాడ నాగేశ్వరరావు, రాజబోయిన శివాజీ, తుమ్మల జగదీష్, యర్రగుంట్ల వినోద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పసుపులేటి సుబ్బారావు, కానూర్ల శ్రీను, పకీరు, పొన్నగంటి బాలకృష్ణ, వెనిగళ్ళ రాము, గంప భీమయ్య, యలమంచిలి దినేష్, మరీదు శ్రీను, శివరాం, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి జనసేన నాయకులు చిమట రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ఇంటి ముందు కలకలం.. బోరుగడ్డ యూటర్న్, సజ్జలపై తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది.వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు. ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను మీడియాకు వినిపించారు.తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు.జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీసుకు రమ్మని నాలుగు గంటలు కూర్చోబెట్టారని అయినా జగన్ రెడ్డిని కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, వైసీపీ అభిమానిగా చెప్పుకుంటున్న బోరుగడ్డ ఆకస్మికంగా నిరసనకు దిగడంతో తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద కలకలం చెలరేగింది. అంతేకాకుండా పార్టీలో జగన్ తర్వాత ఎక్కువ ప్రాధాన్యం ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జలపై అత్యంత తీవ్ర వ్యాఖ్యలతో బోరుగడ్డ విమర్శలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది.ఎన్నడూలేని విధంగా బోరుగడ్డ ఇలా ఆందోళనకు దిగడం వెనుక కారణాలు ఏంటి అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ సానుభూతిపరుడిగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో బోరుగడ్డ చేసిన వ్యాఖ్యలు, ప్రత్యర్థులపై దారుణ దూషణలతో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# మరో 15 ఏళ్లు అధికారంలో ఉండాలి: చంద్రబాబు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మరో 15 సంవత్సరాలు కొనసాగాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజలు ఈ విషయంలో ఆలోచన చేయాలని, వైకుంఠపాళీ రాజకీయాలు చేస్తే.. రాష్ట్రం ఎప్పటికీ.. అభివృద్ధి చెందదని అన్నారు. 2019-24 మధ్య ప్రజలు భయంతో, రాష్ట్రంలో విధ్వంసంతో జీవనం గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలో 2024లో ఎన్డీఏ విజయం ఊహించని విప్లవం. అధికారంలోకి వచ్చాక 7 శ్వేత పత్రాలు ఇచ్చామన్నారు.ఒక ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేస్తే ఎలా ఉంటుందో భోగాపురం విమానాశ్రయం ఓ ఉదాహరణగా చంద్రబాబు పేర్కొన్నారు. డేటా సెంటర్లు, ఐటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, స్టీల్ పరిశ్రమలతో ఓ గ్రోత్ ఇంజన్‌గా మారుతోందన్నారు. 2014లో విభజన తర్వాత ఏపీ పరిస్థితి వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మారిందన్నారు. 58 శాతం మంది జనాభా ఉంటే 46 శాతమే వనరులు ఉన్నాయని తెలిపారు. రాజధాని లేకుండా పోయిందన్నారు. విభజన సమయంలో ఆస్తుల పంపకం కూడా సవ్యంగా జరగలేదన్నారు.2019 తర్వాత రాష్ట్రం విధ్వంసానికి గురైందని పేర్కొన్న చంద్రబాబు అన్ని విధాలా రాష్ట్రం నష్టపోయిందన్నారు. "వ్యవస్థలు కుప్పకూలాయి. శాంతిభద్రతలు లేవు. ఏపీ బ్రాండ్ దెబ్బతింది. పరిశ్రమలు పారిపోయాయి. 2024లో కూటమి అధికారంలోకి వస్తూనే ఏపీ బ్రాండ్ పునరుద్ధరించాం. సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధిని, ప్రాంతీయ సమతుల్యతను కాపాడాం. రాజధానితో పాటు పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల పునర్నిర్మాణం చేపట్టాం. ప్రగతిశీల విధానాలతో పాటు



క్వాంటం లాంటి టెక్నాలజీపై దృష్టి పెట్టాం" అని వివరించారు.

**మీడియా కూడా..**
ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విషయంలో మీడియా కూడా ప్రజలకు వివరించే గురుతర బాధ్యతను తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. కేవలం వార్తలు రాయడమే కాకుండా.. ప్రజల్లో ఆలచన రేకెత్తించేలా కూడా సహకరించాలన్నారు. మీడియా తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని ఆయన వ్యాఖ్యానించారు. 2019-24 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం ప్రజలను వేధించిన తీరుపై మీడియా కూడా ప్రజలకు వివరించాలన్నారు. ఆ ప్రభుత్వం ప్రజలను అణగదొక్కిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంచి చెడులను కూడా మీడియా ప్రస్తావించాలని కోరారు.

# టైర్ 1 సిటీగా మారుతున్న విశాఖ

**విశాఖపట్టణం, ఆగస్టు 4, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణం ఇప్పుడు కేవలం మాటలకే పరిమితం కాకుండా, కళ్లముందే నిజమై కనిపిస్తోంది. ఒకప్పుడు సాధారణంగా ఉన్న రహదారులు నేడు విశాలమైన నేషనల్ హైవేలుగా మారుతుంటే, ఏళ్ల తరబడి ఖాళీగా పడి ఉన్న భూములు ఇప్పుడు పరిశ్రమలతో కళకళలాడుతున్నాయి. సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పాఠశాలలు డిజిటల్ తరగతులుగా రూపాంతరం చెందుతున్నాయి. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో ఆధునిక వసతులతో ఫిషింగ్ హార్బర్లు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి రంగంలోనూ వస్తున్న ఈ మార్పులు రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజలకు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి.ఈ ప్రగతికి సాగరతీర నగరం విశాఖపట్నం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఎన్నో ఆకర్షణీయమైన ప్రకటనలు వచ్చినప్పటికీ, ఆచరణలో అనుకున్నంత పురోగతి కనిపించలేదు. కానీ ఇప్పుడు విశాఖ నగరం కొత్త రూపు దిద్దుకుంటోంది. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టులతో పాటు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో వైజాగ్ ప్రాంతం పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. ప్రకటనల స్థానంలో క్షేత్రస్థాయి ఫలితాలు కనిపిస్తుండటంతో నగర రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు వేగంగా లభిస్తుండటంతో పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నారు. భూముల కేటాయింపు నుంచి పనుల ప్రారంభం వరకు ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీనివల్ల నిన్నటివరకు



నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలు కార్పొరేట్ ఆఫీసులు, పరిశ్రమలతో నిండిపోతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువత.. మళ్లీ సొంత రాష్ట్రానికే తిరిగి వచ్చి ఉద్యోగాలు సాధించే వాతావరణం నెలకొంటోంది.కేవలం పెద్ద ప్రాజెక్టులే కాకుండా విద్య, నైపుణ్య శిక్షణ, తీర ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారు.ఐటీఐల ఆధునీకరణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సముద్ర తీరాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ మత్స్యకారుల సంక్షేమం నుంచి విదేశీ ఎగుమతుల వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ఈ పురోగతి కేవలం ఒక నినాదం కాదు.. అది నిర్మిస్తున్న రహదారులు, తీర్చిదిద్దుతున్న తరగతి గదులు, యువతకు లభిస్తున్న ఉద్యోగాల రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రణాళికాబద్ధమైన ఆలోచనలు, వేగవంతమైన పనులతో రాష్ట్రం వికాస బాటలో వేగంగా అడుగులు వేస్తోంది.

# మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో కీలక ముందడుగు

**విజయవాడ, ఆగస్టు 4, పెన్ పవర్:**
అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేను అధికారికంగా ప్రారంభించారు. భూసేకరణ వల్ల స్థానిక ప్రజలు, వ్యాపార సంస్థలపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, వారికి తగిన పరిహారం , పునరావాసం కల్పించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం.దీనికి సంబంధించి త్వరలోనే ప్రభావిత ప్రాంతాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు.విజయవాడ మెట్రో మొదటి విడత నిర్మాణంలో భాగంగా రెండు ప్రధాన కారిడార్లను ప్రతిపాదించారు.
మొదటి కారిడార్ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుండి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించి ఉండగా.. రెండో కారిడార్ ్రాచీదీూ నుండి పెనమలూరు వరకు సాగనుంది. ఈ రెండింటికీ ప్రధాన రవాణా కేంద్రమైన పండిట్ నెహ్రూ బస్ స్టుషన్ వద్దే రెండు ప్రత్యేక మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లతో పాటు గన్నవరం ఎయిర్‌పోర్టును మెట్రో ద్వారా అనుసంధానించడం వల్ల ప్రయాణికులకు సత్వర , సునాయాస రవాణా వసతి లభించనుంది.గతంలో నిలిచిపోయిన ఈ మెట్రో ప్రాజెక్ట్‌ను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో విజయవాడ , అమరావతి పరిసర ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్‌కు అవసరమైన అనుమతులు, డిజైన్లు , భూసేకరణకు సంబంధించిన పనులు సమాంతరంగా జరుగుతుండటం ప్రాజెక్ట్ అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోంది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ , ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన వెంటనే భూసేకరణ తుది ప్రక్రియ ప్రారంభమై, విజయవాడ మెట్రో నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

# ఫస్ట్ ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ ఆలౌట్.. స్కోర్ ఎంతంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** పోర్ట్ ఆఫ్ స్పెయిన్: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో వెస్టిండీస్ మంచి స్కోరు చేసింది. జస్టిన్ గ్రీవ్స్ (73), రోస్టన్ ఛేజ్ (70) హాఫ్ సెంచరీలు సాధించడంతో.. 239/5 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం రెండో రోజు ఆట కొనసాగించిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 105.4 ఓవర్లలో 344 రన్స్‌కు ఆలౌటైంది. గ్రీవ్స్‌తో ఆరో వికెట్‌కు 96 రన్స్ జోడించిన ఛేజ్.. కీమర్ రోచ్ (19)తో ఏడో వికెట్‌కు 35 రన్స్ జత చేశాడు.

పాక్ బౌలర్ల ధాటికి లోయర్ ఆర్డర్ చేతులెత్తేసింది. షామేర్ జోసెఫ్ (8), జోమెల్ వారికన్ (5 నాటౌట్), జైడెన్ సీల్స్ (8) నిరాశపర్చారు. సాజిద్ ఖాన్ 4, మహ్మద్ అలీ, ఉబైద్ షా, అలీ ఉస్మాన్ తలా రెండు వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ కడపటి వార్తలందేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 7 ఓవర్లలో 30/0 స్కోరు చేసింది. అజాన్? (19 బ్యాటింగ్?), ఇమామ్? (10 బ్యాటింగ్?) క్రీజులో ఉన్నారు.

# టీమిండియాలో కలకలం.. కోచ్ గౌతం గంభీర్‌పై సీనియర్ల ఫిర్యాదు?

- **హెడ్ కోచ్ గంభీర్ కోచింగ్ శైలిపై భారత సీనియర్ ఆటగాళ్ల అసంతృప్తి**
- **కొందరు బీసీసీఐ సభ్యులకు, మాజీ క్రికెటర్లకు అనధికారికంగా ఫిర్యాదు**
- **ఓటమికి బాధ్యత వహించకుండా ఇతరులను నిందించడమే కారణమని ఆరోపణలు**
- **అసంతృప్తి ఉన్నప్పటికీ గంభీర్‌కు అండగా నిలుస్తున్న బీసీసీఐ**
- **కోచ్ గా గంభీర్ భవిష్యత్తుకు కీలకం కానున్న శ్రీలంక టెస్ట్ సిరీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కోచింగ్ శైలిపై జట్టులోని కొందరు సీనియర్ ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. రాహుల్ ద్రవిడ్ తర్వాత కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్ పద్ధతులపై తమకున్న అభ్యంతరాలను కొందరు సీనియర్లు... మాజీ క్రికెటర్లతో పాటు బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లోని సభ్యులకు అనధికారికంగా తెలియజేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో గంభీర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. జట్టు ఓటమికి గంభీర్ బాధ్యత స్వీకరించడానికి ఇష్టపడటం లేదని, ఓటమి భారాన్ని ఆటగాళ్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లేదా సహాయక సిబ్బందిపై నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఓ నివేదిక పేర్కొంది. ఓటమికి కారణం యాజమాన్య నిర్ణయాలు కాదన్నట్లుగా అతను వ్యవహరిస్తున్నాడని, ఈ భావనే ఆటగాళ్లలో అసంతృప్తికి కారణమవుతోందని తెలుస్తోంది. ఈ వ్యవహారం డ్రెస్సింగ్ రూమ్‌లోనూ చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం. ఈ పరిణామాలపై బోర్డు అధికారులు కూడా ఆందోళన చెందుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ అనధికారిక ఫిర్యాదులు, ఆరోపణలు ఎలా ఉన్నప్పటికీ గౌతమ్ గంభీర్‌పై బీసీసీఐ పూర్తి విశ్వాసంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. జట్టులో ఇప్పటికీ అతడే కీలక అధికారిగా, సర్వాధికారాలు కలిగిన వ్యక్తిగా కొనసాగుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలలో వైట్-బాల్ సిరీస్‌లలో ఓటములు, స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టుల్లో వైట్‌వాష్, దక్షిణాఫ్రికాతో సిరీస్ ఓటమి వంటి ఫలితాల నేపథ్యంలో గంభీర్ కోచింగ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శ్రీలంకతో జరగబోయే రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ గంభీర్, అతని కోచింగ్ బృందానికి అత్యంత కీలకంగా మారింది. పలువురు కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా ఈ సిరీస్‌కు అందుబాటులో లేకపోవడం వారికి అదనపు సవాల్‌గా మారింది. ప్రస్తుతానికి ఈ చర్చలన్నీ అనధికారిక స్థాయిలోనే ఉన్నాయని, గంభీర్‌కు బోర్డు మద్దతు కొనసాగుతుందని స్పష్టమవుతోంది.పాక్ బౌలర్ల ధాటికి లోయర్ ఆర్డర్ చేతులెత్తేసింది.

షామేర్ జోసెఫ్ (8), జోమెల్ వారికన్ (5 నాటౌట్), జైడెన్ సీల్స్ (8) నిరాశపర్చారు. సాజిద్ ఖాన్ 4, మహ్మద్ అలీ, ఉబైద్ షా, అలీ ఉస్మాన్ తలా రెండు వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ కడపటి వార్తలందేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 7 ఓవర్లలో 30/0 స్కోరు చేసింది. అజాన్? (19 బ్యాటింగ్?), ఇమామ్? (10 బ్యాటింగ్?) క్రీజులో ఉన్నారు.

# టీమిండియాలో షమీకి దారులు మూసుకున్నట్టేనా?.. సెలక్టర్ల సందేశం ఇదే!

- **గాయపడిన బుమ్రా స్థానంలో యువ పేసర్ ఆకిబ్ నబీకి అవకాశం**
- **మరోసారి సీనియర్ పేసర్ మహమ్మద్ షమీకి దక్కని చోటు**
- **దేశవాళీలో అద్భుత ప్రదర్శన చేసినా సెలక్టర్ల మొండిచెయ్యి**
- **షమీకి టెస్ట్ ఫిట్‌నెస్ లేదన్న చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్**
- **యువ ఆటగాళ్ల ప్రదర్శనే కొలమానంగా మారుతోందన్న స్పష్టమైన సంకేతం**





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తరచూ గాయాల బారిన పడటం జట్టు యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆడినప్పటికీ, శ్రీలంకతో జరగబోయే టెస్ట్ సిరీస్‌కు బుమ్రా మరోసారి గాయంతో దూరమయ్యాడు. అతని స్థానంలో జమ్మూ కశ్మీర్ యువ పేసర్ ఆకిబ్ నబీకి బీసీసీఐ అవకాశం కల్పించింది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన నబీకి చోటు దక్కడంపై హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ నిర్ణయం సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ కెరీర్‌పై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తోంది.గత కొంతకాలంగా షమీ టీమిండియాకు దూరంగా ఉంటున్నాడు. అతను 2023 నుంచి టెస్టులకు, గత ఏడాది నుంచి వన్డేలకు, 2025 నుంచి టీ20లకు ఎంపిక కాలేదు. తొలుత ఫిట్‌నెస్ సమస్యలతో పక్కనపెట్టినా, గత ఏడాదిగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ జాతీయ జట్టులోకి అతనికి పిలుపు అందడం లేదు.షమీ పునరాగమనంపై బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను ప్రశ్నించగా, టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన ఫిట్‌నెస్ అతనికి లేదని స్పష్టం చేశాడు. అయితే, వాస్తవ గణాంకాలు మరోలా ఉన్నాయి. షమీ తన చివరి ఏడు రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో ఏకంగా 1383 బంతులు వేసి, 16.72 సగటుతో 37 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మూడుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన, కెరీర్ బెస్ట్ గణాంకాలు (8/90) కూడా ఉన్నాయి. ఇంత శ్రమించినా ఫిట్‌నెస్ లేదనడం చర్చనీయాంశంగా మారింది.మరోవైపు శ్రీలంకతో సిరీస్‌కు ఎంపికైన ఆకిబ్ నబీ రంజీ సీజన్‌లో అద్భుతంగా రాణించాడు. కేవలం 12.56 సగటుతో 60 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతని ప్రదర్శనకు గుర్తింపు లభించింది.ఈ ఎంపికతో అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ షమీకి, ఇతర సీనియర్ ఆటగాళ్లకు ఒక స్పష్టమైన సందేశం పంపినట్లు కనిపిస్తోంది. కేవలం దేశవాళీలో రాణిస్తే సరిపోదు, జాతీయ జట్టులో చోటు కోసం పోటీ పడుతున్న యువ ఆటగాళ్ల కంటే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, పూర్తి ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సిందే. ఇకపై యువ ఆటగాళ్లు కేవలం జట్టును నింపడానికి కాకుండా, వారి ప్రదర్శన ఆధారంగా నేరుగా తుది జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో షమీ తిరిగి జట్టులోకి రావడం మరింత కష్టతరం కానుంది.

# పియానో వాయిస్తూ.. బుట్టబొమ్మలోని కొత్త కోణం

తెలుగు లోగిళ్లకు -బుట్టబొమ్మ-గా సుపరిచితమైన స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ఇటీవల తనలోని సరికొత్త కళాత్మక కోణాన్ని ఆవిష్కరించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. నిరంతరం సినిమాలు, గ్లామరస్ ఫోటోషూట్‌లతో బిజీగా ఉండే ఈ భామ.. తాజాగా తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేసిన ఒక క్యూట్ అండ్ స్పెషల్ వీడియో నెట్టింట విపరీతంగా వైరల్‌గా మారింది. కేవలం నటనలోనే కాకుండా సంగీతంలోనూ తనకున్న ప్రతిభను చూపేందుకు పియానో వాయిద్య ప్రదర్శనతో పూజా నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.హాలీవుడ్‌లో ఆస్కార్ అవార్డులను కొల్లగొట్టిన పాపులర్ మ్యూజికల్ డ్రామా -లా లా ల్యాండ్-. ఈ చిత్రంలోని ఐకానిక్ మేలడీ ట్యూన్ -మియా అండ్ సెబాస్టియన్ థీమ్- ప్రతి ఒక్కరినీ మైమరిపిస్తుంది. గత కొద్దిరోజులుగా ఈ ధున్ తన మనసును బాగా వెంటాడుతోందని.. అందుకే స్వయంగా దీన్ని ఎలా ప్లే చేయాలో నేర్చుకుని.. కీబోర్డ్ - పియానోపై ప్లే చేశానని పూజా హెగ్డే వెల్లడించారు. ఎంతో ఏకాగ్రతతో, ఎంతో నైపుణ్యంతో ఆ నోట్స్ ప్లే చేస్తుంటే నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు.

ఈ మ్యూజికల్ వీడియోకు పూజా హెగ్డే జోడించిన సరదా క్యాప్షన్ మరింత హంగామా సృష్టిస్తోంది. --గత కొన్ని రోజులుగా ఈ ట్యూన్ నన్ను వెంటాడుతోంది. ఎలాగైతేనేం దీన్ని ప్లే చేయడం నేర్చుకున్నాను. ఇక ఇప్పుడు హాలీవుడ్ స్టార్ హీరో ర్యాన్ గోస్లింగ్ ఇక్కడికి రావడమే ఆలస్యం!-- అంటూ చమత్కారంగా శీర్షిక రాసుకొచ్చారు. -లా లా ల్యాండ్- చిత్రంలో ర్యాన్ గోస్లింగ్ పియానో ప్లేయర్ పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంలోని మూడ్‌కు అనుగుణంగా పూజా సరదా వ్యాఖ్య అభిమానులను ఎంతగానో అకట్టుకుంది.ఈ వీడియోలో పూజా హెగ్డే వాయించిన పియానో ట్యూన్‌తో పాటు తన లుక్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయబద్ధమైన చీరకట్టు- షార్ట్ హెయిర్ స్టైల్‌తో ఎంతో ప్రశాంతంగా, అందంగా కనిపిస్తూ నెటిజన్ల మనసులను దోచుకున్నారు. పూజాలోని సంప్రదాయం, ఆధునిక భావాలు కలగలిసి కనిపించడంతో ఈ వీడియోకు లక్షలాది లైక్స్ - వ్యూస్ లభిస్తున్నాయి. అభిమానులు ఈ రూపంలో పూజాను చూసి మురిసిపోతున్నారు.ప్రస్తుతం ఈ పోస్ట్‌పై ఫ్యాన్స్ సహా సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. -లా లా ల్యాండ్- సినిమాలో నటి ఎమా స్టోన్ చేసిన మియా పాత్రలాగే మీరు ఎంతో అందంగా ఉన్నారు.. పూజా హెగ్డే కీబోర్డ్ ప్లే చేయడం.. మధ్యలో ఆమె చిందించిన చిరునవ్వు నిజంగా అద్భుతం! అంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఒక కథానాయికగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా... ఇలాంటి విభిన్నమైన నైపుణ్యాలను బయటపెడుతూ బుట్టబొమ్మ అందరినీ ఆకట్టుకుంటోంది. పూజా నటించిన జననాయగన్ ఇటీవలే విడుదలైన సంగతి తెలిసిందే. తదుపరి వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



**నేహా శెట్టి 'పల్ప్ ఫిక్షన్' తరహా శైలి: ఆకర్షణీయమైన లుక్ సినీ కెరీర్**





**ప్రకృతి పావని ఆధునిక సొబగులను నిర్వచించింది**

*Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com*